ఏమో గుర్రం ఎగరావచ్చు..

ఎన్టీఆర్, దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కలిసి మాట్లాడుకోవడం.. వీరిద్దరూ కలిసున్న స్టిల్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. నిజానిక్కూడా ఇది షాకింగ్ కాంబినేషనే. వీరిద్దరూ కలిసి పనిచేస్తే.. అనే ఊహకే గూజ్‌బంప్స్ వచ్చేస్తాయి. నటుడిగా ఎన్టీఆర్ ఏంటో.. దర్శకుడిగా సందీప్‌రెడ్డి వంగా శైలి ఏమిటో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఈ ఇద్దరూ కలిస్తే ఆ సినిమా 'యానిమల్' కాదు, 'డైనోసారే' అవుతుందనేది చాలామంది అభిప్రాయం. నిజానికి వీరిద్దరూ చాలా బిజీ. తారక్ 'దేవర-1' ఈ నెల 27న విడుదల కానుంది. మరోవైపు ఆయన బాలీవుడ్‌లో 'వార్-2' చేస్తున్నారు. ఇంకోవైపు ప్రశాంత్‌నీల్ సినిమా ఉండనేవుంది. ఆ తర్వాత 'దేవర- 2'.. ఇలా క్షణం తీరిక లేకుండా కెరీర్ సాగిస్తున్నారు తారక్. సందీప్‌రెడ్డి వంగా కెరీర్ కూడా ఇంచుమించూ అలాగే ఉంది. ప్రస్తుతం ఆయన 'స్పిరిట్' స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారు. షూటింగ్‌ని నిరవధికంగా ఏడాదిపాటు ప్లాన్ చేశారట. పైగా ప్రభాస్‌ని కూడా ఏడాది డేట్లు అడిగారని బాలీవుడ్ టాక్. మరోవైపు 'యానిమల్ సీక్వెల్' ఉండనే ఉంది. ఇవి గాక పైప్‌లైన్‌లో సందీప్‌కి చాలా కమిట్‌మెంట్లున్నాయి. మరి వీరిద్దరూ కలిసేదెప్పుడు? సినిమా చేసేదెప్పుడు? సినిమా పరిశ్రమలో ఏమైనా జరగొచ్చు.. ఏమో గుర్రం ఎగరావచ్చు..

అలా అడుగుతుంటే నవ్వొస్తుంది



తన గురించి చాలామందికి తెలియని విషయాలను మీడియా సాక్షిగా బయటపెట్టేసింది జాతీయ ఉత్తమనటి నిత్యామీనన్. 'తిరుచిత్రాంబలం' చిత్రానికి గాను జాతీయ ఉత్తమనటిగా ఇటీవలే ఆమె ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కుటుంబం గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది నిత్యమీనన్. 'నా అసలు పేరు ఎన్.ఎస్.నిత్య. ఎన్.ఎస్ అనేది నా ఇంటిపేరు కాదు. 'ఎన్' అంటే నళిని.. మా అమ్మ పేరు. 'ఎస్' అంటే సుకుమార్.. మా నాన్నపేరు. వారి పేర్ల లోని మొదటి అక్షరాలను తీసుకొని అలా పెట్టుకున్నా. మా ఫ్యామిలీలో ఇంటిపేర్లను వాడరు. కులాన్ని పేర్లతో ముడిపెట్టడం మా ఇంట్లో ఇష్టం ఉండదు. అయితే.. వృత్తి రీత్యా దేశవిదేశాలు తిరగాల్సిరావడంతో తప్పనిసరై పాస్‌పోర్ట్‌లో నా పేరుకు 'మీనన్'ని జత చేశా. అది కూడా న్యూమరాలజీ ఆధారంగా. ఈ 'మీనన్' వల్ల నన్నందరూ మలయాళీ అనుకుంటారు. ప్రొడక్షన్ హౌస్ వాళ్లు ఫోన్ చేసి 'టికెట్ కొచ్చి నుంచి వేయమంటారా మేడమ్..' అని అడుగుతుంటారు. నాకు నిజంగా నవ్వొస్తుంటుంది. నిజానికి మేం బెంగళూర్ వాసులం. మూడు తరాలుగా మా కుటుంబం అక్కడే ఉంటుంది. స్కూల్‌లో నా సెకండ్ లాంగ్వేజ్ కన్నడ' అంటూ అసలు విషయాలు చెప్పి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశారు నిత్య మీనన్.

రానా-దుల్కర్ సల్మాన్ 'కాంత' ప్రారంభం

రానా, దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర హీరో వెంకటేష్ క్లాప్‌నిచ్చారు. దర్శకుడు మాట్లాడుతూ '1950 మద్రాస్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే కథ ఇది. నాటి సాంఘిక పరిస్థితుల్లో మానవ భావోద్వేగాలను ఆవిష్కరిస్తూ సాగుతుంది' అన్నారు. నటుడిగా పర్‌ఫార్మ్ చేయడానికి ఎంతో స్కోప్ ఉన్న పాత్ర ఇదని దుల్కర్ సల్మాన్ తెలిపారు. పీరియాడిక్ కథాంశంతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని రానా పేర్కొన్నారు. సముద్రఖని, భాగ్యశ్రీ బోర్సే తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: డాని శాంచెజ్ లోపెజ్, సంగీతం: జాను, నిర్మాణ సంస్థ: స్పిరిట్ మీడియా, వేఫేరర్ ఫిల్మ్స్, నిర్మాతలు: రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్, దర్శకత్వం: సెల్వమణి సెల్వరాజ్.

ఫస్ట్‌పార్ట్‌ని మించేలా ఉంటుంది

'ఫస్ట్ పార్ట్ హిట్. దానికి సీక్వెల్ వస్తుందనగానే ఆడియన్స్ ఎక్సయిట్ అవుతారు. అయితే.. సినిమా పూర్తయి విడుదలకి వచ్చేసరికి దానిపై బజ్ తగ్గొచ్చు. ఆసక్తి పలచబడకముందే వేడివేడిగా వడ్డించేయాలని గప్‌చిప్‌గా సినిమాను పూర్తి చేశాం. ఇప్పుడు వస్తున్న బజ్ చూస్తుంటే మా స్టాటజీ కరెక్టే అనిపిస్తుంది' అన్నారు హీరో శ్రీసింహా కోడూరి. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'మత్తువదలరా 2' శ్రీసింహా తొలి విజయం 'మత్తువదలరా' చిత్రానికి ఇది సీక్వెల్. ఫరియా అబ్దుల్లా కథానాయిక. రితేష్‌రానా దర్శకుడు. చిరంజీవి(చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మాతలు. ఈ నెల 13న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీసింహా సోమవారం విలేకరులతో ముచ్చటించారు. 'ఫస్ట్ పార్ట్‌కి పూర్తి భిన్నంగా నా గెటప్ ఉంటుంది. యాక్షన్ సీన్స్ కూడా ఎక్కువే ఉంటాయి. 'హీ టీమ్ ఏజెంట్స్'గా ఇందులో కనిపిస్తాం. ఫస్ట్‌పార్ట్‌లో డెలివరీ బాయ్స్‌గా ఉన్నమేం హీ టీమ్ ఏజెంట్స్‌గా ఎలా మారాం అనేది ఇందులో ఆసక్తికరమైన అంశం. ఫస్ట్‌పార్ట్‌కి సరిగ్గా మ్యాచ్ అయ్యేలా ఆర్గానిక్‌గా కథ తయారైంది. ఈ క్రెడిట్ అంతా దర్శకుడిదే.' అని శ్రీసింహా పేర్కొన్నారు. ఫరియా అబ్దుల్లా పాత్రలో ఫన్‌తో పాటు యాక్షన్ కూడా ఉంటుందని, ఈ సినిమాలో తను పాట రాసి, కొరియోగ్రాఫ్ చేయడం ప్రమోషన్స్‌కి బాగా యూజ్ అయ్యిందని ఆయన అన్నారు. రాజమౌళి, ప్రభాస్‌లకు ట్రైలర్, టీజర్ నచ్చాయని ప్రొడక్ట్ విషయంలో వాళ్లు చాలా హ్యాపీగా ఉన్నారని, అన్నీ కుదిరితే ఈ ఫ్రాంచైజీ కొనసాగుతుందని శ్రీసింహా తెలిపారు.

మా నాన్న సూపర్‌హీరో

సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మా నాన్న సూపర్‌హీరో'. అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. దసరాకు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారాన్ని మొదలుపెట్టారు. సోమవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'మధ్యతరగతి యువకుడి జీవన ప్రయాణం నేపథ్య కథాంశమిది. ప్రేమ, అనుబంధం తాలూకూ నిజమైన అర్థాన్ని తెలియజేస్తుంది. తండ్రీకొడుకుల అనుబంధానికి దర్పణంలా ఉంటుంది' అన్నారు. సాయిచంద్, షాయాజిషిండే, రాజు సుందరం, ఆమని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జై క్రిష్, దర్శకత్వం: అభిలాష్ రెడ్డి.

'క' హక్కులు తీసుకున్న దుల్కర్

యువ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'క'. పీరియాడిక్ కథాంశంతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సుజీత్, సందీప్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సినిమా మలయాళ థియేట్రికల్ హక్కులను అగ్ర హీరో దుల్కర్ సల్మాన్ సొంతం చేసుకున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ చూసిన దుల్కర్ సల్మాన్ ఎంతగానో ఇంప్రెస్ అయ్యారని, తమ సంస్థ వేఫరర్ ఫిలింస్ ద్వారా రిలీజ్ చేయడానికి ముందుకొచ్చారని మేకర్స్ తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ కథాంశమిదని, ఆద్యంతం ఊహించని మలుపులతో సాగుతుందని దర్శకులు తెలిపారు. నయన్‌సారిక, తన్వీరామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విశ్వాస్ డానియేల్, సంగీతం: సామ్ సీఎస్, దర్శకత్వం: సుజీత్, సందీప్.

వినోదాలు పంచే సారంగపాణి

ప్రియదర్శి హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాత. రూప కొడువాయూర్ కథానాయిక. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేదా అతను చేసే పనుల్లో ఉంటుందా? అనే ప్రశ్నలకు సమాధానాలిస్తూ ఆద్యంతం చక్కటి హాస్యంతో సాగే చిత్రమిది. హైదరాబాద్, విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. ఈ నెల 12 నుంచి డబ్బింగ్ కార్యక్రమాలు ప్రారంభిస్తాం. మా బ్యానర్‌లో గుర్తుండిపోయే చిత్రమవుతుంది' అన్నారు. వీకే నరేష్, తనికెళ్ల భరణి, శ్రీనివాస్ అవసరాల, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్‌సాగర్, రచన-దర్శకత్వం: మోహనకృష్ణ ఇంద్రగంటి.

అందుకే కాస్త విరామం!

కన్నడ కస్తూరి రష్మిక మందన్న సోషల్‌మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన సినిమాలకు సంబంధించిన వివరాలతో పాటు వ్యక్తిగత విషయాలను కూడా ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటుంది. అయితే గత రెండుమూడు వారాలుగా ఈ భామ సోషల్‌మీడియాకు దూరమైంది. షూటింగ్ బిజీలో ఉండటం వల్ల సోషల్‌మీడియాకు కాస్త బ్రేక్‌ని చ్చిందని అందరూ అనుకున్నారు. తాజా పోస్ట్‌లో తన బ్రేక్‌కు గల కారణాన్ని వివరించింది రష్మిక మందన్న. గత నెలలో తాను చిన్న ప్రమాదానికి గురయ్యానని, దాంతో కొన్ని రోజులు రెస్ట్ తీసుకున్నానని, ఇప్పుడు పూర్తిగా కోలుకొని ఫిట్‌గా తయారయ్యానని పేర్కొంది. 'ప్రమాదం చాలా చిన్నదే. డాక్టర్ల సలహా మేరకు రెండు వారాలు ఇంటి దగ్గరే విశ్రాంతి తీసుకున్నా. ఇప్పుడు పూర్తిగా కోలుకున్నా. తిరిగి మీ ముందుకు రావడానికి ఉత్సాహంగా ఉన్నా' అని తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో రష్మిక మందన్న చెప్పింది.

నమ్మిన దానికోసం నిలబడే ధీశాలి

'నమ్మిన దానికోసం నిలబడే ధైర్యశాలి పాత్రను 'రఘు తాత'లో పోషించాను. ఆ పాత్రకు జీవం పోయడం నిజంగా సవాలుగా అనిపించింది. ఇప్పుడు ఓటీటీ ద్వారా ఈ పాత్ర ప్రపంచానికి చేరవ అవుతుండటం చాలా ఆనందంగా ఉంది' అంటున్నది జాతీయ ఉత్తమనటి కీర్తిసురేశ్. ఆమె ప్రధాన పాత్ర పోషించిన తమిళ చిత్రం 'రఘు తాత'. హోంబళే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రానికి సుమన్ కుమార్ దర్శకుడు. తమిళనాట థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం సెప్టెంబర్ 13న ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా కీర్తి సురేశ్ ఆనందం వ్యక్తం చేసింది. సున్నితమైన హాస్యంతో సామాజిక సమస్యలపై స్పందిస్తూ తీసిన ఈ సినిమా తమకెంతో ప్రత్యేకమని నిర్మాత విజయ్ కిరగందూర్ అన్నారు. 'రఘు తాత' అన్ని భాషలకూ చేరువ అవుతుండటం పట్ల దర్శకుడు సంతోషం వెలిబుచ్చారు.

ఇది రూట్స్‌ని గుర్తుచేసే సినిమా

' 'ఉత్సవం' రెస్పెక్టబుల్ సబ్జెక్ట్. నిజంగా గర్వంగా చెప్పుకునే సినిమా. ఇదొక వండర్‌ఫుల్ జర్నీ. ఇందులో కథే హీరో. రాజేంద్రప్రసాద్, నాజర్, ప్రకాశ్‌రాజ్, బ్రహ్మానందం వంటి గొప్ప నటులు ఇందులో భాగమయ్యారు. వారినుంచి చాలా నేర్చుకున్నా.' అంటున్నారు హీరో దిలీప్ ప్రకాశ్. ఆయన కథానాయకుడిగా రెజీనా కసాండ్రా కథానాయికగా రూపొందిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్‌సాయి రచన, దర్శకత్వం వహించిన ఈ సినిమాకు సురేశ్ పాటిల్ నిర్మాత. ఈ నెల 13న మైత్రీమూవీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో దిలీప్ ప్రకాశ్ విలేకరులతో ముచ్చటించారు. 'ఇది రూట్స్‌ని గుర్తుచేసే సినిమా. రంగస్థల కళాకారుల నేపథ్యంలో సినిమా ఉంటుంది. సినిమా వచ్చిందే నాటకం నుంచి. ఆ ప్రభావం కథలో ఉంటుంది. అలాగే ఫ్యామిలీ డ్రామా, రొమాన్స్ కూడా ఉంటాయ్. అనూప్ రూబెన్స్ ఇచ్చిన మంచి సంగీతం ఆడియన్స్‌ని కట్టిపడేస్తుంది. మొత్తంగా ఇదో ఫీల్‌గుడ్ సినిమా' అని దిలీప్ ప్రకాశ్ చెప్పారు.

రుద్రభూమి నేపథ్యంలో శ్లోక

ప్రముఖ రచయిత, దర్శకుడు జనార్ధన మహర్షి స్వీయదర్శకత్వంలో రూపొందిస్తున్న సంస్కృత చిత్రం 'శ్లోక'. జనార్ధన మహర్షి కుమార్తెలైన శ్రావణి, శర్వాణి ఈ చిత్రానికి నిర్మాతలు. రాగిణి ద్వివేది ప్రధానపాత్ర పోషిస్తున్న ఈ చిత్రం గురించి జనార్ధన మహర్షి మాట్లాడుతూ 'స్మశానంలోకి వెళ్లి ప్రకృతి ఆకృతితో మాట్లాడే ప్రత్యేకమైన యువతి పాత్రలో ఇందులో రాగిణి ద్వివేది కనిపిస్తారు. ఈ సినిమాలో స్మశాన నేపథ్యంలో సాగే రుద్రభూమి సన్నివేశాలు చాలా కీలకం. బెంగళూరు, మైసూర్‌లో జరిగిన షెడ్యూల్‌లో ఆ సన్నివేశాలను తెరకెక్కించాం. ఇది వైవిధ్యమైన కాన్సెప్ట్. కథ డిమాండ్ మేరకు దేశంలోని పురాతనమైన అనేక స్మశానాలలో షూటింగ్ చేశాం. ఒక సంస్కృత విద్యార్థిగా ఈ సినిమాను సంస్కృతంలో తీస్తున్నందుకు గర్వంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని మంచి సినిమాలు తీయాలనుకుంటున్నా' అని తెలిపారు. తనికెళ్ల భరణి, వజ్రేశ్వరి కుమార్, గురుదత్, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శివ మల్లాల, నిర్మాణం: సర్వేజనాః సుఖినోభవంతు ఫిలింస్.

వైవిధ్యమైన ప్రయాణం 6జర్నీ

రవిప్రకాశ్‌రెడ్డి, సమీర్ దత్త, టేస్టీ తేజ, పల్లవి, రమ్యారెడ్డి ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం '6జర్నీ'. బసీర్ అలూరి దర్శకుడు. పాల్యం రవిప్రకాశ్‌రెడ్డి నిర్మాత. సెన్సార్ కార్యక్రమాలకు సిద్ధమైన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. అందరూ ప్రాణం పెట్టి పనిచేసిన సినిమా ఇదని, సాంకేతికంగా కూడా సినిమా అభినందనీయంగా ఉంటుందని దర్శకుడు చెప్పారు. సినిమా బాగా వచ్చిందని, దర్శకుడు బసీర్ బాగా తీశారని, అందరికీ నచ్చే సినిమా అవుతుందని నిర్మాత తెలిపారు. ఇంకా ఇందులో నటీనటులతో పాటు అతిథులుగా విచ్చేసిన రమేశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: టి.సురేందర్‌రెడ్డి, సంగీతం: ఎం.ఎన్.సింహా, సమర్పణ: పాళ్యం శేషమ్మ, బసిరెడ్డి, నిర్మాణం: అరుణకుమారి ఫిలింస్.

నాన్న పేరు నిలబెడతా

బుల్లితెర నటుడు ప్రభాకర్ తనయుడు చంద్రహాస్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'రామ్‌నగర్ బన్నీ'. విస్మయశ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రితూ మంత్ర కథానాయికలు. శ్రీనివాస్ మహత్ దర్శకుడు. మలయజ ప్రభాకర్, ప్రభాకర్ పొడకండ నిర్మాతలు. వచ్చే నెలలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ సినిమా ఫస్ట్‌లుక్, గ్లింప్స్‌ని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా విడుదల చేశారు. హీరో చంద్రహాస్ మాట్లాడుతూ 'అమ్మా నాన్నల సపోర్ట్ వల్లే నేనిక్కడున్నా. మా నాన్న ప్రభాకర్ పేరు నిలబెట్టేలా కష్టపడతా. 'రామ్‌నగర్ బన్నీ'గా మీ ముందుకు తొలిసారి రాబోతున్నా. ఇది అందరికీ కనెక్టయ్యే సినిమా. వచ్చే నెలలో సినిమాను విడుదల చేస్తాం. ఈ సినిమా వసూళ్లలో పదిశాతం వరదబాధితుల సహాయార్థం రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్స్‌కు ఇవ్వాలని నిర్ణయించాం' అని తెలిపాడు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు.